క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

జి.మాడుగుల: చింతపల్లి రోడ్డు మార్గంలో కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డులో కొలువై ఉన్న కొక్కిరమ్మ తల్లి ఉత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ సన్నిధిలో అలయ ధర్మకర్త వనభంగి బాలయ్యదొర ఆధ్వర్యంలో గుదలంవీధి అంజ నాద్రి ఆశ్రమం సింహాచలం సిద్ధియోగి గురూజీ హోమం నిర్వహించారు. గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నస మారాధన కార్యక్రమం జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గబ్బాడి శేఖర్, సభ్యులు మత్స్యరాజు, మోహన్‌రావు, బాలాజీ, అరుణ్, నూకరాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రికి పయనమైన మాలధారులు



దూసరపాము నుంచి విజయవాడకు ప్రయాణమైన భవాని మాలధారులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి, దూసరపాము, రాజవొమ్మంగి, లాగరాయి తదితర గ్రామాలకు చెందిన భవానీ మాలధారులు గురువారం విజయవాడలోని ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు. 40 రోజులగా చేపడుతున్న దీక్ష విరమించేందుకు గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడులు ధరించి విజయవాడకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు



ఎస్‌ఆర్‌పీ రాజు

కొయ్యూరు: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఆర్‌పీ సీహెచ్.రాజు చెప్పారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ దసరా పండగ ముగిసిన తరువాత క్షేత్రస్థాయిలో తనిఖీలను నిర్వహిస్తామన్నారు. తొమ్మిది మంది డీఆర్‌పీలు పాల్గొంటారని చెప్పారు. మండలంలోని పలుచోట్ల రహదారులు, సచివాలయ భవనాల నిర్మాణాలకు వెచ్చించిన నిధులను పరిశీలిస్తామన్నారు. మండలంలో 33 పంచాయతీల్లో ఆడిట్‌ను పూర్తి చేస్తామన్నారు.దీ నికి అవసరమైన సోషల్ ఆడిట్‌లు చేపడతామన్నారు. ప్రస్తుతం రికార్డులను వీఆర్‌పీల నుంచి తీసుకుంటున్నామన్నారు.ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే తనిఖీలు మొదలు పెడతామన్నారు.

హెడ్ కుక్ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు

జి.మాడుగుల: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో(కెజీబీవీ)లో ఖాళీగా ఉన్న టైప్- 4లోహెడ్ కుక్ సహాయకురాలి పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్ను ఎంఈవో సీహెచ్ బాబూరావు పడాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టు ఎటువంటి విద్యా అర్హత ఉండనక్కర లేదని, ఈ నెల 15వ తేదీలోగా ఎంఈవో కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి

మారేడుమిల్లి: మండలంలో సత్యసాయి మంచి నీటి పథకం కార్మికుడు ఆవులు ధర్మారెడ్డి (30) శుక్రవారం మృతి చెందాడు. మద్దులూరు గ్రామానికి చెందిన ధర్మారెడ్డి మండలంలోని కుట్రవాడ సత్యసాయి మంచినీటి పథకంలో పనిచేస్తున్నాడు. కొంతకాలంలో తీవ్ర ఆనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ధర్మారెడ్డి మృతికి సిబ్బంది, యూనియన్ నాయకులు సంతాపం తెలిపారు. అయితే గత నాలుగు రోజులు క్రితం కంగాల పోతురాజు అనే సత్యసాయి మంచినీటి పథకం కార్మికుడు కూడా అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే.

సంతకు పండగ కళ

- గొర్రెలు, మేకలు, కోళ్లకు రికార్డు ధర
- దసరాతో జోరందుకున్న అమ్మకాలు



సంతలో మేకలు, గొర్రెలు అమ్మకాలు



గుత్తులపుట్టు సంతలో నాటుకోళ్లు అమ్ముతున్న గిరిజనులు

సాక్షి, పాడేరు : విజయదశమి(దసరా) పండగతో ఏజెన్సీలోని మేకలు, గొర్రెల అమ్మకాలు జోరందుకున్నాయి. గురువారం ఏజెన్సీ సంతలకు దసరా పండగ కళ ఏర్పడింది. మండలంలోని గుత్తులపుట్టు, జి.మాడుగులలోని మద్దిగరువు వారపు సంతలు గిరిజనులతో రద్దీగా మారాయి. అన్ని దుకాణాలు వ్యాపారంతో కళకళలాడాయి. గిరిజనులంతా ఈ సంతలో తమ వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకుని ఆ ఆదాయంతో దసరా పండగకు అవసరమయ్యే నిత్యావసర సామగ్రిని కొనుగోలు చేసుకున్నారు.

భారీగా నాటుకోళ్లు, మేకల అమ్మకాలు

గుత్తులపుట్టు వారపు సంతకు జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, పాడేరు మండలాలకు చెందిన గిరిజనులంతా తాము పెంచుకుంటున్న మేకలు, గొర్రెలు, నాటుకోళ్లను భారీగానే అమ్మకానికి తీసుకువచ్చారు. స్థానిక, మైదాన ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు, పలు వర్గాల ప్రజలు భారీగానే సంతకు తరలివచ్చారు. గత నెల రోజుల నుంచి ఏజెన్సీ వ్యాప్తంగా అన్ని వారపుసంతలు, మండల కేంద్రాల్లో గొర్రెలు, మేకలు అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. దసరా పండగతో ప్రతి ఏడాది గొర్రెలు, మేకలకు అధిక ధరలు పలుకుతాయి. ఈ ఏడాది కూడా గిరిజన రైతులు అధిక ధరతోనే వీటిని విక్రయించారు. సాధారణ రోజుల్లో జత మేకలు, గొర్రెలను రూ.15వేలకు అమ్మే గిరిజన రైతులు దసరా పండగ సీజన్‌తో ఒక్కసారిగా ధరలను పెంచారు. అయితే ఏజెన్సీలోని మేకలు, గొర్రెలు మంచి ఆరోగ్యకరంగా ఉండడంతో వ్యాపారులంతా అధిక ధరలైన వీటినే కొనుగోలు చేస్తున్నారు. గుత్తులపుట్టు వారపుసంతలో జత గొర్రెలు, మేకలను రూ.20వేలు నుంచి రూ.30వేల ధరతో సైజును బట్టి గిరిజనులు అమ్మకాలు జరిపారు. అలాగే నాటుకోళ్లకు కూడా రికార్డు ధర నెలకొంది. కిలో బరువున్న నాటుకోడిని కూడా రూ.వెయ్యి ధరతో గిరిజనులు ఈ సంతలో అమ్మకాలు జరిపారు. గుత్తులపుట్టు సంతలో గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల వ్యాపారమే ప్రధానంగా జరగడంతో సంతలో దసరా సందడి నెలకొంది.

జి.మాడుగుల: విజయ దసమి పండుగ సందర్భంగా మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో గురువారం జరిగిన వారపు సంతకు పండుగ కళ వచ్చింది.జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు సరిహద్దు గ్రామాల గిరిజన ప్రజలకు ఈ వారపుసంతే పెద్దదిక్కు. సంతలో గిరిజన అటవీ వ్యవసాయ ఉత్పత్తులు తరలించి విక్రయిస్తారు. అలాగే మేకలు, గొర్రెలు, నాటుకోళ్ల వంటివి సంతలో విక్రయిస్తారు. పండుగ సమయాల్లో కొత్తదుస్తులు, పండుగ సంబరాలకు అవసరమైన నిత్యవసర సరుకులు, ఇతరత్ర వస్తువులు కొనుగోలు చేశారు. ఏజెన్సీలో వివిధ ప్రాంతాలకు గిరిజనులు భారీ తరలివచ్చారు. దసరా పండుగకు అవసరమైన నూతన దుస్తులు, నాటుకోళ్లు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయడంతో సంతకు పండగ కళ కన్పించింది.



మద్దిగరువు సంతలో అమ్మకానికి తీసుకువచ్చిన నాటు కోళ్లు



సంతకు తరలివచ్చిన గిరిజనం

సంతకు దసరా శోభ

జి.మాడుగుల: విజయ దసమి పండుగ సందర్భంగా మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో గురువారం జరిగిన వారపు సంతకు పండుగ కళ వచ్చింది.జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు సరిహద్దు గ్రామాల గిరిజన ప్రజలకు ఈ వారపుసంతే పెద్దదిక్కు. సంతలో గిరిజన అటవీ వ్యవసాయ ఉత్పత్తులు తరలించి విక్రయిస్తారు.అలాగే మేకలు, గొర్రెలు, నాటుకోళ్ల వంటివి సంతలో విక్రయిస్తారు. పండుగ సమయాల్లో కొత్తదుస్తులు, పండుగ సంబరాలకు అవసరమైన నిత్యవసర సరుకులు, ఇతరత్ర వస్తువులు కొనుగోళు చేసారు. ఏజెన్సీలో వివిధ ప్రాంతాలకు ప్రజలు, రైతులు భారీ తరలి వచ్చి దసరా పండుగకు అవసరమైన పిల్లలు, పెద్దలు, కుటుంబం సభ్యులకు నూతన దుస్తులు, నాటుకోళ్లు, నిత్యావసర వస్తువులు కొనుగోళు చేయటంతో సంతకు పండగల కళ కన్పించింది.

పోలీసుల ముమ్మర తనిఖీలు



కొత్తూరు జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండల కేంద్రం నుంచి కొత్తూరు, కుజభంగి నుంచి రూడకోట వెళ్లే మార్గాల్లో గురువారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.గత కొన్ని రోజులుగా సరిహద్దు గ్రామాల్లో దొంగతనాలు జోరుగా జరుగుతుండడంతో పాటు సరిహద్దులో మావోయిస్టుల కదలికల సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో కొత్తూరు జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేశారు.ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల రాకపోకలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాహనదారుల వివరాలు సేకరిస్తూ విడిచి పెడుతున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ దొంగతనాలపై సరిహద్దు ప్రజలంతా నిత్యం అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు,అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉంటూ, ఎటువంటి అనుమానం వచ్చిన తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దొంగతనాల నివారణ కోసం పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ మేరకు రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

మాతాశిశు మరణాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డీపీహెచ్ఎన్‌వో భూలోకమ్మ

దుంబ్రిగుడ: మాతాశిశు మరణాలను నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీపీహెచ్ఎన్‌వో భూలోకమ్మ గురువారం ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లీ బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ఆహార భద్రత, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత అవసరమన్నారు. ఆశ కార్యకర్తలు తమ విధుల్లో భాగంగా వినియోగించాల్సిన పలు యాప్‌లను వివరించారు. వైద్యాధికారి అంబికా, ఎంపీహెచ్ఈవో శౌరీ పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



కింజేరులో బాలికలతో ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో నీలిమ

దుంబ్రిగుడ: అందరి భాగ్యస్వామ్యంతోనే బాల్య వివాహాల నిషేధం సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ అన్నారు. జాతీయ బాలకల దినోత్సవాన్ని మండలంలోని పలు పంచాయతీల్లో గురువారం నిర్వహించారు. మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కింజేరు, గసభ పంచాచా కూడా, కోర్రాయి పంచాయతీ అంజోడా అంగన్వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అందరి భాగస్వామ్యంతోనే నిషేధించడం సాధ్యపడుతుందన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో బాల్య వివాహాలు అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహాల నిర్మాణ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ నబ్బోలు తదితరులు

ముంచంగిపుట్టు: మండలంలోని బరడ పంచాయతీ హంసబంధ గ్రామంలోని పీవీటీజీలకు పీఎం జన్ మన్ పథకం ద్వారా మంజూరైన గృహాల పనులకు గురువారం సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు నబ్బో, వైఎస్సార్‌సీపీ నాయకులు భూమిపూజ చేశారు. సర్పంచ్ పార్వతమ్మ మాట్లాడుతూ పీవీటీజీలు ఈ గృహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గృహ నిర్మాణ శాఖాధికారులు ఇంటి నిర్మాణ పనులకు లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు మంజూరు చేయాలని సూచించారు. నేతలు, గ్రామ పెద్దలు విక్రమ్, శుక్ర, పద్మనాభం, కాసులమ్మ, సుశాంతి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్

వై.రామవరం: దసరా పండుగను పురస్కరించుకుని గ్రామ యువత ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌డాక్టర్ రాహుల్ సహాయ సహకారాలతో గురువారం వై.రామవరంలో క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ టోర్నమెంటు నిర్వహణకు డాక్టర్ రాహుల్ ఆర్థిక సాయం అందిస్తున్నట్టు టోర్నమెంటు కమిటీ అధ్యక్షుడు గొర్లె నరేష్ తెలిపారు. డాక్టర్ రాహుల్ టీమ్‌లను పరిచయం చేసుకుని, రిబ్బన్ కత్తిరించి, బ్యాటింగు చేసి, టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను క్రీడలో ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు మండలంలోని 8 గ్రామాల టీమ్‌ల మధ్య పోటీలు జరిగాయి. ఈ టోర్నమెంటు 10 రోజులపాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామపెద్ద సాసుం మాణిక్యం, ఎస్ఐ బి.రామకృష్ణ, సిఆర్‌పీఎఫ్ పోలీసులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. టోర్నీ నిర్వాహకులు రాజశేఖర్, శివ, యోగేంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

36 మందికి వైద్య పరీక్షలు



వంచంగిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నాగార్జున

రాజవొమ్మంగి మండలంలోని వంచంగి గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ ఉచిత వైద్య శిబిరంలో 36 మంది రోగులకు చికిత్స అందజేసినట్టు డాక్టర్ నాగార్జున తెలిపారు. శిబిరంలో బీపీ సుగర్ సమస్యలు ఉన్న వారికి పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేసినట్టు ఆయన చెప్పారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు చేసి ఆరోగ్య సూత్రాలు తెలియజేశామన్నారు. ఏఎన్ఎం నూకరత్నం, రాజులమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాజుబాబు, 104 డీఈఓ శ్రీనివాస్, పైలట్ కనకరాజు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక సాయం



దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఇన్‌చార్జ ఏడీఎంహెచ్‌వో డేవిడ్

రంపచోడవరం: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బృందావనం మండల సమాఖ్య సభ్యులు పాల్గొని ఏరియా ఆస్పత్రిలో సైకాలజిస్టుని నియమించాలని, మానసిక రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు మందులు అందుబాటులో ఉంచాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషిరెడ్డి, ఏడీఎంహెచ్‌వోలను కోరారు.

ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. దొరబాబు, సత్తిబాబు, వరలక్ష్మి, సంజీవరాణి, ఎం లూథియారాణి, కమలకుమారి తదితరులున్నారు.

ప్రకృతి సాగుతో లాభాలు



రైతులతో మాట్లాడుతున్న మండల యూనిట్ ఇన్‌చార్జి మహేశ్వరి

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయ పద్ధతితో సాగు చేపడితే మంచి లాభాలు పొందవచ్చని ఎఫ్‌పీవో మండల ఇన్‌చార్జి మహేశ్వరి అన్నారు. జి.మాడుగుల గ్రామైక్య సంఘం అధ్వర్యంలో గురువారం రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్ రైతు సాధికార సంస్థ, ఆర్‌వైఎస్ఎస్ ద్వారా నడపటం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు చాలా లాభధాయకమన్నారు. గోమూత్రం, పుట్టమట్టి, శనగపిండి, బెల్లంతో పలు రకాల జీవామృతం ఎరువులు తయారీ చేసుకోవచ్చున్నారు. డీఏపీ, యూరియా వంటి రసాయన ఎరువులకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా సాగు చేసిన పంటలు ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. ఐసీఆర్పీలు ఎర్రయ్యదొర, డమరి రైతులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండగ



పి.యర్రగొండలో బోనాలతో భక్తుల ఊరేగింపు

వై.రామవరం: దేవీ శరన్నవరాత్రులు పురష్కరించుకుని మండలంలోని పి.యర్రగొండ గ్రామ కనక దుర్గమ్మ ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కరణం శారదాచార్యులు ఆధ్వర్యంలో గురువారం భోనాలు పండుగను ఘనంగా నిర్వహించారు. సుమారు వందమంది భక్తులు బోనాలను అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఇందులో భాగంగా ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బోనాలతో పి.యర్రగొండ, వై.రామవరం, వట్టిగడ్డ, వంకబూసి, పనసలపాలెం, చవిటిదిబ్బలు, దేవరమడుగులు గ్రామాల్లో ఊరేగించి, దేవరమడుగులు గ్రామ పెద్దేరువాగులో బోనాలను నిమజ్జనం చేశారు.

అధికారులకు ఘన సన్మానం



ఎంపీడీవో కుమార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎస్ఐ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

అనంతగిరి(అరకులోయ రూరల్): అనంతగిరి ఎంపీడీవో కుమార్, ఎస్ఐ శ్రీనివాస్‌లను అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, వైస్ ఎంపీపీ దూర జయవర్ధిని, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దూరు గంగన్నదొర తదితరులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎంపీడీవో, శాంతి భద్రతల విషయమై ఎస్ఐలు పూర్తిస్థాయిలో గిరిజనులకు అండగా నిలవాలని కోరారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గంగరాజు, జేసీఎస్ కన్వినర్ నవీన్ తదితరులున్నారు.

రోగులకు అందని సురక్షిత నీరు

- రాజేంద్రపాలెం ఆస్పత్రిలో మూలకు చేరిన ఆర్‌వో వాటర్ ప్లాంట్
- తాగునీటికి తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఆర్‌వో వాటర్ ప్లాంట్

కొయ్యూరు: రాజేంద్రపాలెం ఆస్పత్రిలో సాంకేతిక సమస్య కారణంగా ఆర్‌వో తాగునీరు ప్లాంట్ మూలకు చేరింది.దీంతో రోగులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల కిందట రాజేంద్రపాలెం ఆస్పత్రిలో ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. నాటి నుంచి రోగులతో పాటు ఆస్పత్రికి సిబ్బంది సురక్షిత తాగునీటిని తాగుతున్నారు. అయితే 20 రోజుల కిందట సాంకేతిక సమస్య వల్ల ఆర్‌వో ప్లాంట్ పనిచేయడం లేదు. దీనికి మరమ్మతు చేయాలని పలుమార్లు సంబంధిత సిబ్బందికి సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. ఫలితంగా సురక్షిత నీటి కోసం రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి సుమారు రోజుకు 150 మందికి పైగా వస్తుంటారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ పాడైన ఆర్‌వో ప్లాంట్‌ను వెంటనే సరి చేయిస్తామని తెలిపారు. సంబంధిత సిబ్బందికి సమాచారం అందించి తక్షణమే దాని సమస్యను పరిష్కరించాలని సూచిస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సత్కారం



పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్ పుష్పలత, సిబ్బంది

చింతపల్లి: చింతపల్లి మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు గొలుగొండ మండలం ఎ.ఎల్.పురం పంచాయతీకి బదిలీ అయింది. ఈ సందర్భంగా ఆయనకు సహచరులు, గ్రామస్తులు తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో బదిలీపై వెళుతున్న శ్రీనివాస్ దంపతులను చింతపల్లి, లోతుగెడ్డ, బలపం పంచాయతీల సర్పంచ్‌లు పుష్పలత, చింతర్ల సునీల్, రమేష్‌నాయుడు ఆయా పంచాయతీలు, సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు తదితరులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సిబ్బంది, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొట్లాటలో ఒకరికి గాయాలు

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ సాండికోరి గ్రామానికి చెందిన వంతల అజ్జు మరియు అతని తమ్ముడు వంతల నందు ఒకరునొకరు కొట్లాడుకున్నారు. ఈ కొట్లాటలో నందు కర్రతో అజ్జుకు కొట్టగా రెండు చేతులు విరిగిపోయాయి. దీంతో స్థానికులు అజ్జును పీహెచ్‌సీకి తరలించారు. ఈ సంఘటన వివరాల్లోకి వెళ్తే వంతల నందు గతంలో అతని భార్యను చంపిన కేసులో 14 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి ఇటీవల విడుదలై గ్రామానికి వచ్చి చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే వంతల అజ్జు తన భార్యతో నందు అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వివాదం పెద్దదై కొట్లాటకు దారితీసింది. దీంతో ఈ గొడవలో తీవ్ర గాయపడిన వంతల అజ్జు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. నిందితుడు నందు పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు.